క్లుప్తంగా

పాఠశాల భవన నిర్మాణానికి మార్కింగ్

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి మార్కింగ్ వేసినట్లు ఏఈ నరేందర్ తెలిపారు. మంగళవారం భవన నిర్మాణానికి రూ.2 కోట్ల 31 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. మొత్తం 24 గదుల ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ ఆంజనేయులు, డీఈ సలీమ్, ఏఈ నరేందర్, గ్రామస్తులు వెంకటేశ్వర్లు గౌడ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి

మల్దకల్: హరితహారం నాటికి నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను పెంచేందుకు నర్సరీ నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీఓ స్వామి సూచించారు. మంగళవారం మండలంలోని అమరవాయి, మల్దకల్ గ్రామాలలోని నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నర్సరీలో హరితహారం నాటికి మొక్కలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మమ్మ, నర్సరీ నిర్వాహకులు రంగన్న, రఘుపతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరు గ్రామానికి చెందిన వడ్డే వీరమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామ యువకులు మంగళవారం మృతురాలి ఇంటికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. యువత నుంచి పోగు చేసిన రూ. 22,000లను ఆర్థికసాయంగా కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో యువకులు, ప్రజలు, తదితరులు ఉన్నారు.

దరఖాస్తు గడువు పెంచాలి



కేటీదొడ్డి: మండలంలోని కొండాపురం, గువ్వలదిన్నె, ఎర్సందొడ్డి, పాగుంట, గ్రామాలలో ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తు చేసేందుకు ఈ నెల 6వరకు గడువు విధించారు. కొండాపురం గ్రామంలో పేదలు సకాలంలో దరఖాస్తు చేసుకోలేదు. మంగళవారం గ్రామంలో ఆర్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభను గ్రామస్తులు బహిష్కరించారు. దరఖాస్తు చేసుకోవడానికి సమయం పొడిగించాలని, ప్లాట్ల పంపిణీ చేసే ముందు లే అవుట్‌లు చేసి తెలపాలని గ్రామస్తులు కోరారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం



మానవపాడు: గ్రామాల పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎంపీడీఓ రమణరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు కలుకుంట్ల, నారాయణపురం తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న పలు అభివృద్ధి పనులపై ఆయా గ్రామస్తులతో చర్చించారు. ఈ సందర్భంగా ఇంకుడు, గుంతలు, టాయిలెట్లు వాడకం, సెగ్రిగేషన్ షెడ్లు వాడకం చెత్తసేకరణ, శానిటేషన్ ఏ విధంగా ఉపయోగిస్తున్నారని ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీఎం కోటిశ్వరి, కార్యదర్శి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంతో పునర్జన్మ



ఆత్మకూర్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి అవయదానం చేయడంతో పునర్జన్మ లభిస్తుందని వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి, డైరెక్టర్ అంజనారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి ఆత్మకూర్‌లోని ఎంజీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో వర్కటం పుట్టినరోజు సందర్భంగా జీవన్‌దాన్ అవయవ దాన కేంద్రం నిర్వాహకులు అవయవదానం గురించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా 55 మంది వీజేఆర్ వలంటీర్లు అవయదానం చేసేందుకు పత్రాలపై సంతకాలు చేశారు. వీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మక్తల్ నియోజకవర్గంలోని గ్రామాల్లో రూ.కోట్లు సొంత నిధులను వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా అవయదానం చేసిన యువకులను జీవన్‌దాన్ నిర్వాహకులు, వర్కటం అభినందించారు.

సమస్యల వలయంలో పీహెచ్‌సీ

- కనీస వసతులు కరువు
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



మల్దకల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. 20 ఏళ్ల కిందట నిర్మించిన పీహెచ్‌సీ గ్రామానికి దూరంగా ఉండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రికి వెళ్లేందుకు గర్భిణులు, రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఆస్పత్రిలో సరైన వసతులు లేక సతమతమవుతున్నారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన చేతి పంపు మరమ్మతు నోచుకోక శిథిలావస్థకు చేరుకుంది. ఆస్పత్రి అభివృద్ధి కోసం వస్తున్న నిధులు దేనికి వెచ్చిస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రికి పూర్తిస్థాయిలో ప్రహరీ లేకపోవడంతో పశువులు, పందులు, గొర్రెలు లోపలికి ప్రవేశించి ఆవరణను అపరిశుభ్రంగా తయారుచేస్తున్నాయి. వైద్యసిబ్బందికి సరైన వసతి గదులు లేకపోవడంతో పాటు ప్రసూతి గదిలో కూడా మౌలిక వసతులు కరువయ్యాయి. అలాగే ప్రతినెల వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసే సమావేశాలకు గదులు లేకపోవడంతో చెట్ల కింద సమావేశాలు నిర్వహించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రోగులు, స్థానికులు కోరుతున్నారు.


గదుల కొరతతో చెట్ల కింద వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డాక్టరు స్వరూపరాణి


శిథిలావస్థకు చేరుకున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆర్చి

సమస్యలు పరిష్కరించాలి



ఆస్పత్రిలో నెల కొన్న సమస్యలను ఉన్నతాధికారులు వెంటనే పరిష్కరించాలి. ప్రతి రోజు ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రహరీ పూర్తిస్థాయిలో నిర్మించాలి. ఆస్పత్రి ఆవరణలోకి పశువులు, పందులు రాకుండా చర్యలు చేపట్టాలి.

– బుడ్డన్న, మల్దకల్

మౌలిక వసతులు కల్పించాలి



రోగులకు సరిపడ కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. సిబ్బందికి గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. రోగులు ఆరుబయట చెట్ల కింద కూర్చోవాల్సిన పరిస్థితి ఉంది. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. రోగులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి.

– జయలక్ష్మి, మల్దకల్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా వెంటనే పనులు చేపడతాం. రోగులకు కనీల సౌకర్యాలు ఏర్పాటుకు కృషి చేస్తా.

– స్వరూపరాణి, డాక్టర్ మల్దకల్

చదువుతోనే మంచి భవిష్యత్


నల్లగట్టుతండాలో బడిబాటలో పాల్గొన్న ఎంఈఓ

గట్టు: చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ కొండారెడ్డి అన్నారు. ప్రొ.జయశంకర్ బడిబాటలో భాగంగా మంగళవారం నల్లగట్టు తండాలో ఉపాధ్యాయులు రాజేష్, వాసీంలతో కలిసి చిన్నారుల తల్లిదండ్రులను కలిశారు. ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉచితంగా భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను అందజేస్తుందన్నారు. అదేవిధంగా బల్గెరలో బడిబాటలో భాగంగా హెడ్మాస్టర్లు రంగన్న, మంజుల, సీఆర్‌పీఎం నర్సింహులు ఇంటింటి తిరుగుతూ పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. మొత్తం 14 మంది విద్యార్థులను బడిలో చేర్పించినట్లు హెడ్మాస్టర్ రంగన్న తెలిపారు.

ధరూరు: బడి ఈడు పిల్లలందరు బడిలోనే ఉండాలని ఎంఈఓ సురేష్, జీహెచ్‌ఎం వెంకటేశ్వరరెడ్డిలు కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంతో పాటు మనానపురం, మార్లబీడు, ఖమ్మంపాడు, ఉప్పేరు తదితర గ్రామాల్లో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికి తిరిగి బడి బయటి పిల్లలను బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రులకు అవగామన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గౌరీ శంకర్, అంగన్‌డీటీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని నారాయణపురంలో మంగళవారం బాడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం చేశారు. పాఠశాలలో విద్యార్థులకు చదువుతోపాటు మానసిక, శారీరక ఉల్లాసానికి క్రీడలు నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిజబాయ్, లక్ష్మీదేవి, సునంద, లక్ష్మన్న, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ధరూరులోని ఖమ్మంపాడులో..


నారాయణపురంలో..

పల్లె ప్రగతికి ఏర్పాట్లు



ఉండవెల్లి: ఈ నెల 15న నిర్వహించే పల్లె ప్రగతి కార్యక్రమానికి అన్ని ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి, కార్మికులకు సన్మానం నిర్వహించాలని, రోడ్లకు ముగ్గులు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ పద్మావతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే క్షయ నివారణ



అమరచింత: అప్రమత్తంగా వ్యవహరించి తగు ఆరోగ్య సూచనలు పాటించడంతో త్వరితంగా క్షయ నుంచి కోలుకునే అవకాశం ఉందని డాక్టర్ నిస్సార్ అన్నారు. పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డీఎంఆర్ఎం ట్రస్టు ద్వారా క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించారు. ప్రతి నెల క్షయ వ్యాధిగ్రస్తులకు డీఎంఆర్ఎం ట్రస్ట్ ద్వారా ఉచితంగా పౌష్టికాహారం అందించడం అభినందనీయం అన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. కేవలం ఆరు నెలల పాటు వైద్యులు సూచించిన ప్రకారం మాత్రలు వేసుకుంటే వ్యాధి నుంచి త్వరితంగా కోలుకునే అవకాశం ఉందన్నారు. వ్యాధిగ్రస్తుల పేర్లు గోప్యంగా ఉంచుతారని, ఇతరులతో మాట్లాడే సమయాల్లో మాస్కులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ సభ్యుడు శ్యామ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పండుగను ఘనంగా నిర్వహిద్దాం


మాట్లాడుతున్న ఎంపీడీఓ సాయిప్రకాష్

అయిజ: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని వివిధ శివార్లలోని 11 చెరువుల వద్ద చెరువుల పండగను ఘనంగా నిర్వహించుకుందామని ఎంపీడీఓ సాయిప్రకాష్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీఓ నరసింహారెడ్డితో కలిసి గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమవావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. గ్రామ పంచాయతీ అధికారులు నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి పెద్ద చెరువులవద్ద సాయంత్ర చెరువుల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి డప్పులు, బోనాలు, బతుకమ్మలు, మత్స్య కారుల వలలతో ఊరేగింపుగా చెరువులవద్దకు చేరుకోవాలని సూచించారు. చెరువు గట్లపై ముగ్గులు, తోరణాలతో అలంకరించాలని కోరారు. కట్టమైసమ్మ పూజ, చెరువు నీటి పూజ నిర్వహించే పూజకు అధిక సంఖ్యలో తరలిరావాలని పేర్కొన్నారు. అనంతరం సభ ఏర్పాటుచేసి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకునేలా నిర్వహించాలన్నారు. ఇరిగేషన్‌లో వచ్చిన ప్రగతి, పెరిగిన పంటల ఉత్పత్తి వివరాలు, మత్స్య సంపద, భూగర్భ జలాల పెరుగుదల తదితర వివరాలు తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల గ్రామ పంచాయతీ కార్యార్శులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతితో అధిక దిగుబడులు


పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఈఓ

ఎర్రవల్లిచౌరస్తా: రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏఈఓ భరత్ అన్నారు. మంగళవారం ఇటిక్యాల మండలంలోని చాగాపురం, బుడ్డారెడ్డిపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి పంటలను రైతులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం పత్తి పంటలో బాస్వరం లోపం అధికంగా ఉందన్నారు. దీని వల్ల పత్తి మొక్క యొక్క కాండం , ఆకులు అధిక మొత్తంలో ఎరుపు రంగులోకి మారుతాయని పేర్కొన్నారు. దీని నివారణ కోసం ఎకరానికి 75 కేజీల డీఏపీ లేదా మూడు బస్తాల సింగిల్ సూపర్ పాస్ఫేట్‌ను పత్తి పంటలో వేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు, తదితరులు ఉన్నారు.

ఇదేం చోద్యం..



మండల తహసీల్దార్ కార్యాలయాన్నే అధికారులు పార్కింగ్ అడ్డాగా మార్చారు. కార్యాలయంలో ద్విచక్ర వాహనం, సైకిల్‌ను పార్కింగ్ చేశారు. దీంతో వివిధ పనుల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే వివిధ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు తెలిసినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

– గద్వాల అర్బన్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


ర్యాలీలో పాల్గొన్న సీడీపీఓ కమలాదేవి

అయిజ: అంగన్‌వాడీ టీచర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మల్దకల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ కమలాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని పులికల్‌లో అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. చిన్నారుల ఎత్తు, బరువులను పరిశీలించారు. పోషకాలతో కలిగే ప్రయోజనాలు వివరించారు. అదేవిధంగా అంగన్‌వాడీ బడిబాటలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాష్ట అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తుపత్రాల, పులిక్ అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు నాగరాణి, యామిని, వాసంతి, బాలమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం

అలంపూర్: బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. ఇటిక్యాల మండలం వల్లూరు గ్రామానికి చెందిన అన్నదమ్ములు ఇస్మాయిల్, ఇబ్రహీం జీవనోపాధి కోసం కర్నూల్‌కు వలస వెళ్లారు. వీరు కుటుంబసభ్యులతో కలిసి మానవపాడు మండలం బోరవెల్లి గ్రామానికి ఒక శుభకార్యానికి వచ్చారు. అన్నదమ్ముల పిల్లలు మానవపాడు మండలం మంగంపేట వద్ద కృష్ణానదిలో స్నానాల కోసం వెళ్లి ప్రమాదశాత్తు మునిగి మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే అబ్రహం కర్నూల్‌లోని వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. చిన్నారులకు నివాళులర్పించి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబాలకు అన్నీ విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ చల్లా నివాళి..

ఈతకు వెళ్లి మృత్యువాతపడిన చిన్నారులకు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి నివాళులర్పించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కర్నూల్‌లోని బాధిత నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జక్కిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రవిరెడ్డి సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అబ్రహం మంగళవారం గ్రామానికి వెళ్లి శ్రీనివాస్‌రెడ్డి భౌతిక కాయానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

గట్టు: తప్పులు లేకుండా ఓటరు జాబితా తయారు చేయాలని తహసీల్దార్ జుబేర్ అహ్మద్ బీఎల్‌ఓలను ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన బీఎల్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బీఎల్‌ఓలు పోలింగ్ బూత్‌ల వారిగా ఓటర్ జాబితాను తీసుకుని ఇంటింటికి వెళ్లాలని సూచించారు. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు ఉంటే ఫాం-8 ద్వారా సవరణలు చేయాలన్నారు. చనిపోయిన ఓటర్‌ను వారి కుటుంబ సభ్యుల అనుమతితో మరణ ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించిన తర్వాతే జాబితా నుంచి తొలగించాలన్నారు. మొబైల్ యాప్‌ను ఉపయోగించే విధానాన్ని బీఎల్‌ఓలకు గణాంక అధికారి శ్రీనివాసులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవి కుమార్, సీనియర్ అసిస్టెంట్ తిరుమలేష్, గణాంక అధికారి శ్రీనివాసులు, గిర్దావర్ కరీం వివిధ గ్రామాలకు చెందిన బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి పరీక్షలు


ఆలూరులో కంటి పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యాధికారి


కేక్ కట్‌చేస్తున్న మెడికల్ ఆఫీసర్ విష్ణు

గట్టు: మండలంలోని ఆలూరు, మాచర్ల, ముచ్చోని పల్లె గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలలో మంగళవారం వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. మూడు గ్రామాల్లో మొత్తం 398 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా, 24 మందికి కంటి అద్దాలను పంపిణీ చేయగా, 31 మందికి కంటి అద్దాల కోసం ప్రతి పాదనలు పంపినట్లు సీహెచ్‌ఓ ఊసేని తెలిపారు. వైద్యాధికారులు తిమ్మప్ప, సాయికిరణ్, సమీరాకౌర్, హెల్త్ సూపర్‌వైజర్లు స్వర్ణలత, బాలమ్మ, ఏఎన్ఎంలు భారతి, రేణుక, ఆయా గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అయిజ: మండలంలోని తూంకుంటలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు కేక్ కట్ చేశారు. అనంతరం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ విష్ణు మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉచితంగా ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించామని, అవసరమైన వారికి ఉచితంగా మందులు, అవసరమైన వారికి కంటి అద్దాలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మమ్మ, ఎంపీటీసీ పద్మ, పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ ఓబులేశ్వరయ్య, ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.

సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

రాజోళి: మండల సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం రైతులతో కలిసి ఆయన తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మకు వినతి పత్రం అందజేశారు. ఇటీవల రైతులు కొందరు రాజోళి శివారులో సర్వే చేసేందుకు దరఖాస్తు చేసుకోగా అవసరమైన సర్వేనెంబర్‌లో సర్వే చేయకుండా ఇతరుల భూముల్లో సర్వే చేసి రైతుల మధ్య విబేధాలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆశన్న, సుజాత, అయ్యన్న, రాముడు, రైతులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి


ధరూరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు: ఈ నెల 12న జిల్లా కేంద్రమైన గద్వాలలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నూతనంగా నిర్మించిన జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, పార్టీ కార్యాలయాలను సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం 3 గంటలకు ఏర్పాటు చేసే భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తారని వివరించారు. సభకు సంబంధించిన పోస్టర్లను ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన విడుదల చేశారు.

ఇంటింటి ప్రచారం ప్రారంభం...

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పలు సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ప్రత్యేకంగా ముద్రించిన ప్రచార పత్రాలను ప్రజలకు అందజేశారు. సీఎం సభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, నాయకులు జాకీర్, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, ప్రభాకర్‌గౌడ్, కురుమన్న, పురుషోత్తంరెడ్డి, సంజీవ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: ఈ నెల 12న నిర్వహించే సీఎం సభకు కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు, రైతులు మహిళలు గ్రామాల నుంచి తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేఖర్, వైస్ఎంపీపీ రామకృష్ణ నాయుడు, మండల అధ్యక్షుడు ఉరుకుందు, హనుమంతు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు చక్రధర్, గోవిందు, నసీర్ పాల్గొన్నారు.